నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, శనివారం 17 మే 2025 | NAGARKURNOOL

బీఆర్ఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పార్టీ నేత ఉప్పల వెంకటేశ్

కేటీఆర్, హరీశ్‌రావును కలిసిన ఉప్పల వెంకటేశ్

కల్వకుర్తి, మే 16 : బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావును శుక్రవారం పార్టీ రాష్ట్ర నాయకుడు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఉప్పల వెంకటేశ్ మర్యాద పూర్వకంగా కలిశారు. కల్వకుర్తి నియోజకవర్గంలో గులాబీ పార్టీతోపాటు రాజకీయ పరిస్థితుల గురించి మాజీ మంత్రులతో వారు వివరించారు. పార్టీని మరింత బలోపేతం చేయడంపై చర్చించినట్లు తెలిపారు.

పిల్లలమర్రిలోని ఆలయం వద్ద నమస్కారం చేస్తున్న మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్

అందాల భామలు అదరహో..

- పాలమూరులోని పిల్లలమర్రిని సందర్శించిన 22 మంది సుందరీమణులు
- మహావృక్షం వద్ద సెల్ఫీలతో సందడి
- ఆకట్టుకున్న సాంస్కృతికం
- స్వాగతం పలికిన మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ, అధికారులు

మహబూబ్‌నగర్, మే 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రపంచ అందాల పోటీలకు వివిధ దేశాల నుంచి వచ్చిన భామలు శుక్రవారం పాలమూరులో సందడి చేశారు. జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి పర్యాటక కేంద్రాన్ని సందర్శించారు. సాయంత్రం 5గంటలకు హైదరాబాద్ నుంచి మూడు ప్రత్యేక బస్సుల్లో చేరుకున్న 22మంది సుందరీమణులకు కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి ఘన స్వాగతం పలికారు. అనంతరం 16వ శతాబ్దంలో నిర్మించిన పురాతమైన శ్రీరాజరాజేశ్వరి ఆలయంలో పూజలు చేశారు. పిల్లలమర్రి సమీపంలోని మ్యూజియంలో కళాకృతులు, శిల్పాలను తిలకించగా, అధికారులు వాటి విశిష్టతలను గురించి తెలిపారు. అనంతరం 3ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పిల్లలమర్రి చెట్టు విశిష్టతను వివరించారు. భారతదేశంలోని అతి పురాతనమైన మర్రి చెట్లలో ఇది మూడొవదని, ఇక్కడి భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా ఓడల మర్రి పెరిగిందని వెల్లడించారు. చెట్టు మొదలు ఊడలు, కొమ్మలను చూసి ప్రపంచ సుందరీమణులు ఆశ్చర్యపోయారు. తమ ఫోన్లలో సెల్ఫీలు తీసుకున్నారు. ఇంత పెద్ద మర్రిచెట్టును ఎన్నడూ చూడలేదని, ప్రకృతి అద్భుతమని కొనియాడారు. పిల్లలమర్రి ఆవరణలో జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అలరించాయి. స్థానిక మహిళలతో కలిసి సుందరీమణులు బతుకమ్మ ఆడారు. గిరిజన సంక్షేమ బాలికలతో ముచ్చటించారు. అనంతరం తిరిగి హైదరాబాద్ తిరుగు పయనమయ్యారు. కాగా, పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, పర్ణికారెడ్డి, వీర్లపల్లి శంకర్, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు

ఉపాధి హామీ కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటాం. కూలీలు పని చేసేచోట తాగునీరు సరఫరా చేసే బాధ్యత గ్రామ పంచాయతీలకు అప్పగించాం. నీడ కోసం ఏర్పాటు చేసే టెంట్లను ప్రభుత్వం నిలిపివేసింది. కూలీలకు పనిచేసే చోట మెడికల్ కిట్లు అందుబాటులో ఉండేలా చూస్తాం. ప్రథమ చికిత్స కోసం అవసరమయ్యే సామగ్రిని అందిస్తాం. ఎండల నుంచి రక్షణ కల్పించడానికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తాం. వడదెబ్బ తగలకుండా కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

- శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో, కోడేరు

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి..

ఎండాకాలం కూలీలు వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉన్నది. తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదయం 11గంటల వరకే పనులు ముగించుకోవాలి. తలకు ఎండ తగలకుండా టవల్ చుట్టుకోవాలి. నిమ్మరసం, మజ్జిగ వంటివి ఎక్కువగా తీసుకోవాలి. తెల్లటి కాటన్ దస్తులు వేసుకోవాలి. ఎండల వల్ల వడదెబ్బకు గురైతే ప్రాణాపాయ పరిస్థితులు ఎదుర్కోకతప్పదు.

- అనిల్‌కుమార్, వైద్యాధికారి, కోడేరు

నిలువ నీడ కరువు

- అసౌకర్యాల మధ్య జరుగుతున్న ఉపాధి హామీ పనులు
- పని ప్రదేశంలో కనిపించని కనీస సౌకర్యాలు
- ఇండ్ల నుంచే బాటిళ్లలో తాగునీళ్లు తెచ్చుకుంటున్న వైనం
- వడదెబ్బకు గురవుతున్న కూలీలు
- ఎమర్జెన్సీలో కనిపించని మెడికల్ కిట్లు
- నిర్లక్ష్యంలో అధికారులు

కోడేరు, మే 16 : వలసలు తగ్గించి స్థానికంగా ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు అసౌకర్యాల మధ్య కొనసాగుతున్నాయి. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలనే ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఉపాధి కూలీలు నానా అవస్థలు పడుతున్నారు. పూట గడవాలంటే ఉపాధి పనులకు వెళ్లక తప్పని కూలీలు అసౌకర్యాల లేమితో ఎండలో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. చెరువుల్లో పూడికతీసే పనులతోపాటు కాల్వల పూడికతీత, రైతుల పొలాల్లో కట్టలు వేయటం వంటి పనులు చేపడుతున్నారు. ఎర్రటి ఎండలో చెమటోడ్చి పని చేసిన వారికి గొంతు తడార్పుకునేందుకు మంచినీళ్లు, కాసేపు సేద తీరటానికి నిలువ నీడ లేని దుస్థితి నెలకొన్నది. ఇంకుడుగుంతలు, పశువుల షెడ్లు, నీటి తొట్లు, నర్సరీల ఏర్పాటు, చెక్‌డ్యాంలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, నీటిపారుదల కాల్వల్లో పూడికతీత, పొలాలకు అనుసంధాన రోడ్లు, నీటికుంటల నిర్మాణం, హరితహారం మొక్కలకు కంచె ఏర్పాటు, నీళ్లు పోసే పనులకు ప్రాధాన్యమిచ్చారు. భానుడు భగభగ మండుతుండటంతో కూలీలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పనులు చేయాల్సి వస్తున్నదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పనుల వివరాలు ఇలా..

నాగర్‌కర్నూల్ జిల్లాలోని 466 గ్రామ పంచాయతీల్లో మొత్తం 1.95లక్షల ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు ఉండగా, 3.75లక్షల మంది ఉపాధి కూలీలను అధికారులు గుర్తించారు. అందులో 1.73లక్షల మంది ఉపాధి పనులు చేస్తున్నారు. ఎస్సీలు 26.74 శాతం ఉండగా, ఎస్టీలు 17.21శాతం ఉన్నారు.

2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.20.18లక్షల బడ్జెట్‌ను కేలాయించా రు. గతేడాది 2024-25 సంవత్సరానికి రూ.36.45లక్షల నిధులను కేటాయించారు. బీఆర్ఎస్ పాలనలో కూలీలకు సేద తీరటానికి టెంట్లు ఏర్పాటు చేసేవారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అటువంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో కూలీలుఎ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని కూలీలకు వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

అసౌకర్యాల మధ్యే..

నీడ, తాగునీరు, మెడికల్ కిట్లు, అందుబాటులో ఉండాలని నిబంధనలు ఉన్నప్పటికీ అవేవీ కానరావడం లేదు. కనీసం తాగునీళ్లు లేక కూలీలు తమ వెంట నీళ్ల బాటిళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. కూలీలకు అత్యవసర సమయాల్లో ఉపయోగించే మెడికల్ కిట్లను అందించాల్సి ఉండగా, అదికారులు గతేడాది నుంచి అటువంటి చర్యలు చేపట్టడం లేదు. ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురై వడదెబ్బ లక్షణాలతో మృతిచెందిన ఘటనలు జిల్లాలో అనేకం ఉన్నాయి. అంతేకాకుండా పని ప్రాంతాల్లో తేళ్లు, పాముకాట్లకు గురవుతున్నారు. అత్యవసర సమయంలో ప్రథమ చికిత్స కిట్లు లేక కూలీలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పనిచేయాల్సి వస్తున్నది. పనులకు వచ్చే వారికి రూ.300 కూలీ ఇవ్వాల్సి ఉన్నది. కానీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సగటు కూలీ రూ.150 నుంచి రూ.200వరకు అందుతుందని వాపోతున్నారు.

కోడేరు మండలంలో ఎండలోనే పనులు చేస్తున్న కూలీలు

భూత్పూర్ పోలీస్ స్టేషన్‌లో మహిళా సంఘాల నాయకురాళ్లు

సుందరీమణులకు రూ.500 కోట్ల ఖర్చు అవసరమా?

- ఖజానా ఖాళీ అంటూనే దుబారా ఖర్చులెందుకు?
- చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కో కన్వీనర్ శ్రీదేవి

భూత్పూర్, మే 16 : సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ఖజానాలో రూపాయి లేదంటూనే ప్రపంచ సుందరీమణుల కోసం రూ.500కోట్లు ఖర్చు చేసి దుబారా చేయడమెందుకని చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కో కన్వీనర్ శ్రీదేవి ప్రశ్నించారు. శుక్రవారం ప్రపంచ సుందరీమణులు మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రికి వస్తున్న నేపథ్యంలో వారిని అడ్డుకుంటారని చైత్యన్య మహిళా సంఘం సభ్యులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసినట్లు ఆమె తెలిపారు. ముందుగా పాలమూరులోని రూరల్ పోలీస్‌స్టేషన్, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి అక్కడి నుంచి భూత్పూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. రాష్ట్రంలో రైతులు పండించిన పంటలు అకాల వర్షాలకు తడిసి పాడైపోతుంటే కన్నీరు పెడుతున్నారని, వారిని గాలికొదిలేసి లేని ఆర్భాటాలకు పోయి ప్రపంచ సుందరీమణుల పోటీలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ మహిళలతో విదేశాల సుందరీమణుల కాళ్లు కడిగించి ఇక్కడి ఆడపడుచుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని మండిపడ్డారు. అనంతరం వీరికి మద్దతుగా ప్రజాసంఘాల నాయకులు, టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఖలీల్ తదితరులు భూత్పూర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంఘీభావం తెలిపారు. అరెస్ట్ అయినవారిలో చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి, ఐద్వా కార్యదర్శి పద్మ, అనురాధ ఉన్నారు.

కలిసికట్టుగా పనిచేయాలి

- స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలి
- పరిపాలనలో కాంగ్రెస్ అట్టర్‌ఫ్లాప్
- ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి
- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి
- కౌకుంట్ల మండల శ్రేణులతో సమావేశం

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్, మే 16 : ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం అన్నాసాగర్‌లోని తన నివాసంలో కౌకుంట్ల మండల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ విషయాన్ని కార్యకర్తలకు ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి బీఆర్ఎస్ నేతలను విమర్శించడమే పనిగా పెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. పదేండ్లు సంబురంగా సాగిన వ్యవసాయం ఏడాదిలోనే తలకిందులయ్యిందన్నారు. సమయానికి సాగునీళ్లు లేక, అరకొరగా వచ్చిన పంటలను అమ్ముకుందామంటే కూడా అష్టకష్టాలు పెట్టడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై తప్పుడు కేసులను పెట్టి బెదిరింపులకు పాల్పడితే సహించేది లేదన్నారు. కౌకుంట్ల మండలంలో పార్టీ బలంగా ఉన్నదని, మరింత ఉత్సాహంగా పనిచేయాలని సూచించారు. యువకులు సోషల్ మీడియాపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ప్రజల పక్షాన నిలబడాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించేందుకు ప్రతి కార్యకర్త పనిచేయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చందుగౌడ్, మాజీ ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, నాయకులు రఘు, కిష్టన్న, శేఖర్‌రెడ్డి, రవి, కృష్ణయ్య పాల్గొన్నారు.

నల్లబెల్లం పట్టివేత

పట్టుబడిన నల్లబెల్లంతో ఎక్సైజ్ పోలీసులు

కొత్తకోట, మే 16 : కొత్తకోట ఎక్సైజ్ శాఖ సర్కిల్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన రూట్‌వాచ్ దాడుల్లో నల్లబెల్లాన్ని తరలిస్తున్న రెండు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కరుణ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. కర్నూల్ నుంచి పెబ్బేరుకు ఆటోలో 750కేజీల నల్లబెల్లాన్ని తరలిస్తున్న మోహన్‌కుమార్ అనే వ్యక్తిని పట్టుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా చిత్తూరు నుంచి మహారాష్ట్రకు బొలేరో వాహనంలో 3,500 కేజీల నల్లబెల్లాన్ని తరలిస్తున్న సుబ్రహ్మణ్యాన్ని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. రెండు వాహనాలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై పృథ్వీరాజ్, కానిస్టేబుళ్లు నాగరాణి, తిరుమలేశ్, జనార్దన్, వినోద్ ఉన్నారు.

ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా?

మహబూబ్‌నగర్, మే 16 : ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ అందాల పోటీలు నిర్వహించొద్దని ప్రశ్నించిన మహిళలను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లో పెట్టడమే ప్రజాపాలనా అని మహిళా సంఘం నాయకురాలు శ్రీదేవి ఒక ప్రకటనలో ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. పిల్లలమర్రి సందర్శనకు వస్తుండగా మహిళా సంఘాల నాయకురాలను అక్రమంగా అరెస్ట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో నిరసన చేసే హక్కు ఉంటుందని, వారి హక్కులను కాలరాస్తూ పోలీస్‌స్టేషన్‌కు తరలించడం సిగ్గుచేటన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ అర్బన్, మే 16 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జూనియర్ బాలబాలికల హ్యాండ్‌బాల్ జట్లకు ఆదివారం పాలమూరులోని స్టేడియం మైదానంలో ఎంపికలు ఉంటాయని హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి సయ్యద్ తఖీయొద్దీన్, శంకర్ నాయక్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల ఉమ్మడి జిల్లాలోని బాలబాలికలు ఆధార్‌కార్డు, బోనఫైడ్‌తో ఉదయం 10గంటలకు స్టేడియం మైదానంలో హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు 9948585065 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

పడితే పాతాళానికే..

- నల్లమల ఘాట్ రోడ్డులో కూలిన రక్షణ గోడలు

నల్లమల ఘాట్ రోడ్డులో కూలిన రక్షణ గోడ

దోమలపెంట, మే 16 : అమ్రాబాద్ మండలం నల్లమల అభయారణ్యం సమీపంలోని దోమలపెంట, ఈగలపెంటలో ఘాట్ రోడ్డు ప్రమాదకారంగా మారింది. వాహనాలు అదుపుతప్పితే పాతాళానికే అన్నట్టుగా శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారి మారింది. శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు దేశనలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. మన్ననూర్, వటవర్లపల్లి ఏడమ పాతాళ గాంగ వరకు సుమరు 58కిలోమీటర్లు పూర్తిగా కొండలు, లోయల మీదుగా ఘాట్ రోడ్డు ప్రయాణం ఉంటుంది. 30ఏండ్ల కిందట రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన రక్షణగోడ శిథిలమై కూలిపోయాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై ఎన్‌హెచ్ఏ కల్వకుర్తి డీఈ రమేశ్‌ను వివరణ కోరగా, రక్షణ గోడల కోసం రూ.కోటి బడ్జెట్‌తో అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదించామని, నిధులు వచ్చాక అటవీశాఖ అధికారుల అనుమతి తీసుకొని పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

ప్రాణం తీసిన క్రికెట్ గొడవ

- రూ.12 లక్షలకు తెగిన పంచాయితీ

అమరచింత, మే 16 : సరదా కాస్తా విషాదంగా మారింది. వేసవి సెలవుల్లో ఆట విడుపు కావాలనుకుంటే చిన్నపాటి గొడవ ప్రాణం మీదికి తెచ్చింది. క్రికెట్ ఆడుతున్న రెండు గ్రామాల యువకుల మధ్య మొదలైన గొడవ నేపథ్యంలో యువకుడిపై ఐదుగురు వ్యక్తులు దాడి చేయగా.. చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లాలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. అమరచింత మండలం ధర్మాపూర్ శివారులోని నాగల్‌కడ్మూర్, ధర్మాపూర్‌కు చెందిన పలువురు యువకులు మంగళవారం మధ్యాహ్నం క్రికెట్ ఆడుతున్న క్రమంలో గొడవకు దిగారు. చిలికి చిలికి గాలివానలా మాటా.. మాట పెరిగి పెద్దది కావడంతో ధర్మాపూర్ వాసి ఆంజనేయులు(30)పై ఐదుగురు వ్యక్తులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. యువకుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా.. వారు అతడిని అమరచింతలోని దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు దవాఖానకు తరలించగా.. గురువారం రాత్రి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. కాగా ఇరు గ్రామాల పెద్దలు మృతుడి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని పంచాయితీ పెట్టారు. దాడికి పాల్పడిన వారి నుంచి ఆంజనేయులు కుటుంబానికి రూ.12 లక్షలు ఇవ్వాలని పెద్దలు నిర్ణయించారు. ఎస్సై సురేశ్‌ను వివరణ కోరగా.. మృతుడి భార్య మహేశ్వరి రెండ్రోజుల కిందట ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతు కష్టం వర్షార్పణం

- మల్దకల్ మండలం బిజ్వారంలో తడిచిన 4వేల బస్తాలు
- కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం
- అకాల వర్షాలతో రైతన్నకు నష్టం

వర్షానికి తడిసి మొలకలు వస్తున్న ధాన్యం

గద్వాల అర్బన్, మే 16 : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. ఓవైపు కొనుగోళ్లు సాఫీగా సాగకా.. మరోవైపు వర్షాలు కర్షకులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే పలు చోట్ల ధాన్యం తడిచి రైతులు తీవ్రంగా నష్టపోయారు. గురువారం రాత్రి గద్వాల జిల్లాలోని మల్దకల్ మండలం బిజ్వారంలో జోరు వాన కురిసింది. అయితే కొనుగోలు సెంటర్‌లో ఉన్న ధాన్యం తరలించడంలో జాప్యం కొనసాగడంతో తడిసిపోగా రైతులు ఆవేదన చెందుతున్నారు. వారం రోజులుగా పలువురు రైతులకు సంబంధించిన ధాన్యం 4 వేల బస్తాలు కొనుగోలు చేసి సంచుల్లో నింపి కుట్లు వేశారు. ఈ బస్తాలను వెంటనే తరలించకుండా అప్పుడు ఎత్తుతాం.. ఇప్పుడు ఎత్తుతాం.. అంటూ సెంటర్ నిర్వాహకులు, అధికారులు అలసత్వం ప్రదర్శించడంతో సంచులు కేంద్రాల్లో ఉండిపోయాయి. ఇవన్నీ అకాల వర్షానికి తడిసిపోయాయి. అధికారుల తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసేది లేక రైతులు బ్యాగుల్లోని ధాన్యాన్ని బయటకు తీసి ఆరబెట్టారు. కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు తరలించి ఉంటే తమకు కష్టాలు ఉండేవి కావని వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని, ఈ నేపథ్యంలో కేంద్రాల వద్ద కవర్లు అందుబాటులో ఉంచితే ధాన్యం తడిచే అవకాశం లేదన్నారు.

కొనుగోలు కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

తడిసిన ధాన్యం మిల్లులకు తరలిస్తాం

రైతులు దిగులు చెందాల్సిన అవసరం లేదు. ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం. కొంత ఆలస్యమైనా సరే ధాన్యం కొంటాం.. వర్షానికి తడిసిన ధాన్యం సైతం బాయిల్ మిల్లుకు తరలించేలా ఏర్పాట్లు చేశాం. బిజ్వారం కొనుగోలు సెంటర్ పరిస్థితిపై ఆరా తీశాం. ఇప్పటికే తడిసిన ధాన్యం బస్తాలను రెండు లారీల్లో పంపించాం. ఇంకా ఉన్నది. వాటిని బాయిల్ మిల్లుకే తరలించేలా చర్యలు తీసుకుంటాం.. రైతులకు ఇబ్బందులు కల్పించం..

- లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్, గద్వాల